**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్ర**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేదీ. 12.07.2026** **సమయం13.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. సికింద్రాబాద్ పార్లమెంటు పరిధిలోని పేద, మధ్యతరగతి ప్రజల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి విమర్శించారు.
2. విద్యా, వైద్య రంగాలకు తమ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతనిస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు.
3. రోడ్లు అభివృద్ధికి సూచికలని, వాటికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ అన్ని ప్రాంతాలను కలిపే విధంగా రోడ్ల నిర్మాణం జరుగుతుందని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.
4. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వచ్చేమూడురోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది.

…………………………………………

**కిషన్ రెడ్డి**

సికింద్రాబాద్ పార్లమెంటు పరిధిలోని పేద, మధ్యతరగతి ప్రజల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి విమర్శించారు. ఈరోజు అంబర్‌పేట్ నియోజకవర్గంలోని కాచిగూడ డివిజన్‌లో నిర్వహించిన పాదయాత్రలో ఆయన మాట్లాడారు. ప్రతి శని, ఆదివారాలు బస్తీల్లో పర్యటించే కార్యక్రమంలో భాగంగా అధికారులతో కలిసి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుంటున్నట్లు చెప్పారు. హైదరాబాద్ అంటే కేవలం హైటెక్ సిటీ మాత్రమే కాదని, వాస్తవ హైదరాబాద్ బస్తీలలోనే ఉందన్నారు. వర్షాకాలం వచ్చినా రోడ్ల మరమ్మతులు చేయలేదని, వీధిలైట్లు వెలగక బస్తీలు చీకటిమయమయ్యాయని ఆవేదన

వ్యక్తంచేశారు. తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పేరుతో మోసం చేస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి మూడేళ్లు కావస్తున్నా అర్హులైన వారికి పెన్షన్లు ఇవ్వడం లేదన్నారు. అంతకుముందు కాచిగూడలో కిషన్ రెడ్డికి మహిళలు, కార్యకర్తలు పూలవర్షంతో ఘన స్వాగతం పలికారు. పాదయాత్ర మధ్యలో ఆయన ఒక స్థానిక టిఫిన్ సెంటర్‌లో ఆగి, ప్రజలతో ముచ్చటిస్తూ టీ తాగారు. అనంతరం తన టీ బిల్లును స్వయంగా ఫోన్-పే ద్వారా చెల్లించి సామాన్యుడిలా ప్రజల మనసులు గెలుచుకున్నారు.

**డెస్క్**

**మంత్రి దామోదర రాజనర్సింహ**

విద్యా, వైద్య రంగాలకు తమ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతనిస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు.సంగారెడ్డి జిల్లా వట్పల్లిలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న 30 పడకల అత్యాధునిక ఆస్పత్రి నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్పత్రి నిర్మాణం శరవేగంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వట్పల్లి వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించనున్న పోలీస్ స్టేషన్, తాహసిల్దార్ కార్యాలయం, మండల పరిషత్ డెవలప్మెంట్ అధికారి కార్యాలయాల ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు.

**పీటీసీ – సంగారెడ్డి**

**రేవంత్**

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల అవసరం లేకుండానే నీటిని ఎత్తిపోసే అవకాశం ఉంటే, వేల కోట్ల రూపాయలతో వాటిని ఎందుకు నిర్మించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలకు పాల్పడి, ఇప్పుడు తమ ప్రభుత్వంపై విమర్శలు చేస్తోందని ఆయన ఆరోపించారు. సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి

విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడిన ముఖ్యమంత్రి, కాళేశ్వరం ప్రాజెక్టు అంశాన్ని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ నిపుణుల కమిటీకి అప్పగించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. అయితే విశ్రాంత ఇంజినీర్లతో ఏర్పడిన కమిటీపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణాన్ని గతంలోనే వ్యతిరేకించిన వారు ఇప్పుడు భిన్నంగా మాట్లాడుతున్నారని అన్నారు.

**డెస్క్**

**ఉద్యమకారులు**

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ రాజకీయాలకు అతీతంగా సాగుతుందని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ స్పష్టం చేసింది. శనివారం అమరజ్యోతి స్మారక ప్రాంగణంలో తెలంగాణ ఉద్యమ జేఏసీ స్టీరింగ్ కమిటీ నాయకులతో కమిటీ సమావేశమైంది. ఉద్యోగ సంఘాల నుంచి పాల్గొన్న ప్రతినిధులు ఉద్యమం నాటి పరిస్థితులను పంచుకున్నారు. ఉద్యమకారులకు ప్రశంసా పత్రాలు, ఇళ్లు లేని నిరుపేద ఉద్యమకారుల కుటుంబాలకు 250 గజాల స్థలం, వృద్ధాప్య పెన్షన్లు, ఉచిత కార్పొరేట్ వైద్యం కోసం ప్రత్యేక హెల్త్ కార్డులు అందించాలని, ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఛైర్మన్ కె.కేశవరావు, సభ్యులు పాల్గొన్నారు.

**డెస్క్**

**జూపల్లి కృష్ణారావు**

ఎన్నికల సంఘం చేపట్టిన సర్ లో అర్హులైన ఓటర్లందరి పేర్లు బీఎల్ఓలు నమోదు చేయించాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంచిర్యాలలో 'సర్' పై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ....

**బైట్...మంత్రి జూపల్లి కృష్ణారావు**

**పీటీసీ - మంచిర్యాల**

**డిజిటల్ గవర్నెన్స్**

డిజిటల్ గవర్నెన్స్‌లో తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు కృత్రిమ మేధస్సు (ఏఐ)పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దిశానిర్దేశంలో ప్రణాళిక శాఖ, టీజీ మ్యాథ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రాక్టికల్ ఏఐ, జనరేటివ్ ఏఐ అంశాలపై శిక్షణ అందించనున్నారు. ప్రభుత్వ సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా ప్రజలకు చేరవేయడం, పరిపాలనలో ఏఐ వినియోగాన్ని విస్తరించడమే దీని లక్ష్యమని అధికారులు తెలిపారు. భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా ఏర్పాటు చేసిన టీజీ మ్యాథ్ ఇప్పటికే 180కి పైగా ఏఐ స్టార్టప్‌లకు ప్రోత్సాహం అందిస్తూ, రాష్ట్రంలో కృత్రిమ మేధస్సు ఆవిష్కరణలకు కేంద్రంగా నిలుస్తోంది.

**డెస్క్**

**జానకి**

ప్రముఖ నేపథ్య గాయని ఎస్. జానకి మృతి భారతీయ సంగీత ప్రపంచానికి తీరని లోటని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. ఆమె మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన గవర్నర్, తన మధుర గానంతో కోట్లాది మంది హృదయాలను అలరించిన అపూర్వ గాయని జానకి అని కొనియాడారు.

మరోవైపు.. భారతీయ సినీ సంగీత ప్రపంచంలో తన అపూర్వ గానంతో దశాబ్దాల పాటు శ్రోతలను అలరించిన గానకోకిల ఎస్. జానకి మరణం ఎంతో విచారకరమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆమె ఆలపించిన వేలాది పాటలు, వైవిధ్యభరితమైన స్వరాలు తరతరాలకు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని అన్నారు.

**డెస్క్**

**కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

రోడ్లు అభివృద్ధికి సూచికలని వాటికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ అన్ని ప్రాంతాలను కలిపే విధంగా రోడ్ల నిర్మాణం జరుగుతుందని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

అన్నారు.. నల్లగొండ జిల్లా నార్కెట్ పల్లి - మునుగోడు రోడ్డు పరిధిలో సుమారు 76 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టే రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... గత పదేళ్లలో నకిరేకల్ వెనుకబాటుకు గురైందని, తమ ప్రభుత్వ హయాంలో అత్యధిక నిధులు కేటాయిస్తున్నామని అన్నారు..

బీబీనగర్ నడికుడి మార్గంలో డబుల్ ట్రాక్ నిర్మాణం వల్ల రాకపోకలకు అంతరాయం లేకుండా అన్ని ప్రాంతాల్లో కూడా ఆర్ఓబీల నిర్మాణం చేపడుతున్నామని మంత్రి తెలిపారు.

**పీటీసీ – నల్గొండ**

## CP RDM

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా హెచ్చరించారు. మంచిర్యాలలో నిన్న రాత్రి కార్డెన్ సెర్చ్ నిర్వహించిన సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ..

**బైట్.. అంబర్ కిషోర్ ఝా..**

**పీటీసీ – మంచిర్యాల**

**ఆయిల్ ఫామ్**

వరి పంట కంటే ఆయిల్ ఫామ్ సాగు చేయడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చునని, రాజన్న సిరిసిల్ల జిల్లా ఓబులాపూర్ గ్రామానికి చెందిన రైతు తాట్ల లక్ష్మి నర్సయ్య చెప్పారు. ఆకాశవాణితో ఆయన మాట్లాడుతూ......

**బైట్ - లక్ష్మి నర్సయ్య**

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

**వాతావరణం**

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వచ్చే మూడు రోజుల పాటు.. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఆయా జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.

**పీఎస్**

**జనగామ**

మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నడిచే జంతు వధశాలలో కాకుండా సొంత పశువుల పాకలో అపరిశుభ్ర వాతావరణంలో జబ్బు పడిన గొర్రెల, మేకలను నిబంధనలకు విరుద్ధంగా వధిస్తూ విక్రయిస్తున్న వ్యాపారిపై జనగామ మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ లక్ష రూపాయల జరిమానా విధించారు. ఈరోజు జనగామ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని మాంసం విక్రయ కేంద్రాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పరిశుభ్రత లేని మాంసాన్ని స్వాధీనం చేసుకొని, నిబంధనలు పాటించకుండా అక్రమంగా వ్యాపారం కొనసాగించిన వ్యాపారికి జరిమానా విధించారు.

**పీటీసీ - జనగామ**

**రైతు డిస్కం**

రైతు డిస్కం ఏర్పాటుకు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి లైసెన్స్ జారీ చేసింది. ఈ నెల 10 నుంచి నాలుగు నెలల్లోగా సంస్థ కార్యకలాపాలు ప్రారంభించాలని ఆదేశించింది. మూడు నెలల్లోగా సమగ్ర వ్యాపార ప్రణాళికను సమర్పించాలని సూచించింది. వ్యవసాయానికి ప్రస్తుతం అమలులో ఉన్న విధంగానే ఉచిత విద్యుత్ కొనసాగించాలని, రైతుల మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేయరాదని స్పష్టం చేసింది. అయితే వ్యవసాయ ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మాత్రమే విద్యుత్ వినియోగాన్ని అంచనా వేసేందుకు మీటర్లు ఏర్పాటు చేయాలని పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ విద్యుత్, ఎత్తిపోతల పథకాలు, మిషన్ భగీరథ, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లైతో పాటు ఇతర మున్సిపల్ తాగునీటి కనెక్షన్లు రైతు డిస్కం పరిధిలోకి రానున్నాయి.

**డెస్క్**

**నజరానా**

ఆరు హత్యల కేసులో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న పి. రాజ్‌కుమార్ ఆచూకీ తెలిపిన వారికి రెండు లక్షల రూపాయల నగదు బహుమతి అందజేస్తామని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ప్రకటించింది. నిందితుడి అరెస్టుకు దారితీసే విశ్వసనీయ సమాచారం

అందించిన వారికి ఈ బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపింది. సమాచారం అందించే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచడంతో పాటు, వారి భద్రతకు పూర్తి హామీ ఉంటుందని పోలీసు శాఖ వెల్లడించింది. నిందితుడి గురించి ఏవైనా వివరాలు తెలిసిన వారు 8712665324 నంబర్‌లోని చేవెళ్ల పోలీస్ కంట్రోల్ రూమ్‌ను ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా సంప్రదించి సమాచారం అందించాలని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

**డెస్క్**

**అభయహస్తం**

అభయ హస్తం పథకం కింద ఈ ఏడాది యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులై మెయిన్స్ పరీక్షకు అర్హత సాధించినవారు తెలంగాణ ప్రాంత ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని సింగరేణి సంస్థ సూచించింది. దరఖాస్తులను పరిశీలించి అర్హత సాధించిన ప్రతి అభ్యర్థికి ఈ ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందజేస్తామని పేర్కొంది. మరిన్ని వివరాలకు సంస్థ వెబ్‌సైట్‌ను చూడాలని కోరింది.

**డెస్క్**